بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 11 July 2025 (Telugu)

# మక్కా విజయ యుద్ధం నేపథ్యంలో
# హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 11.07.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشۡهَدُ أَنۡ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. కాబా తాళం చెవి ఉస్మాన్ బిన్ తల్హా వద్ద ఉండెనని గత ఖుత్బాలో ప్రస్తావించబడెను. మక్కా జయించబడిన తర్వాత మంచినీళ్లు త్రాగించు సత్కారంతో పాటు తాళంచెవి సత్కారాన్ని కూడ పొందుటకు అనగా తాళం చెవి తనకివ్వాలని హజ్రత్ అలీ రజియల్లాహు అన్హు మనవి చేసిరి. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాబా నుండి బయటకు వస్తూ ఉస్మాన్ బిన్ తల్హాకు తాళంచెవి తిరిగి అప్పగిస్తూ ఇట్లనిరి. اَلْيَوْمُ يَوْمُ الْبِرِّ وَوَفَاءٍ అనగా నేడు సత్కార్యం, ప్రతిజ్ఞను పూర్తి చేయు రోజు. అప్పటికే ఉస్మాన్ బిన్ తల్హా ఇస్లాం స్వీకరించి ఉండిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎందుకు ఇలా ప్రవచించారో దాని వివరాలు ఇట్లు గలవు. వారు స.అ.స. వలస వెళ్లకముందు ఒక సారి ఉస్మాన్ బిన్ తల్హాతో కాబా తాళంచెవి అడిగిరి. బదులుగా అతడు కోపగించుకొంటూ ఎంతో దూషించెను. అప్పుడు వారు స.అ.స. ఎంతో సహనం పాటిస్తు ఇట్లనిరి. ఓ ఉస్మాన్! ఏదో ఒక రోజు ఈ తాళంచెవి నా చేతికి తప్పక వచ్చును. అప్పుడు నేను తలచిన వ్యక్తికి ఈ తాళం చెవి ఇత్తును. ఉస్మాన్ అప్పుడు ఇట్లనెను. అలాంటి సమయం వచ్చినచో అది ఖురైష్ వినాశనం, అవమాన సమయమగును. బదులుగా వారు స.అ.స. ఇట్లనిరి. తప్పు! అప్పుడు ఖురైష్ గౌరవ, మర్యాదల సమయమగును. అప్పుడు వారి స.అ.స. ఎదుర్కొన్న హింసలు, దౌర్జన్యాలన్నియు వారి స.అ.స.కు గుర్తుండెను. అయినను వారు స.అ.స. ఆయా ప్రజల పట్ల కరుణ, దయతో వ్యవహరించారు. వారు స.అ.స. అతనితో ఇట్లనిరి. ఈ తాళంచెవిని నువ్వు శాశ్వతంగా తీసుకో. క్రూరుడు మాత్రమే నీతో ఈ తాళం చెవి గుంజుకొనును. ఇకముందు ఈ తాళంచెవి నీ వంశంలోనే ఉండును. ఫలితంగా ఇప్పటి వరకు ఖానా కాబా తాళంచెవి తర తరాలుగా ఈ వంశంలోనే కొనసాగుతుంది.

ఒక కథనం మేరకు మక్కా విజయ రెండవ రోజు బనూ బుదైల్‌లోని ఒక అన్యారాధకున్ని బనూ ఖజాఅ తెగ హత్య చేసెను. కావున మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జుహ్ర్ తర్వాత ఖుత్బా ఇచ్చుటకు నిలబడిరి. వారు సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ తఆలాను కీర్తించిన తర్వాత ఇట్లనిరి. భూమ్యాకాశాలను పుట్టించిన రోజు నుండి, సూర్యచంద్రాదులను సృష్టించిన, ఈ రెండు పర్వతాలు సఫా, మర్వాను ఏర్పాటు చేసిన రోజు నుండి అల్లాహ్ తఆలా మక్కాను పవిత్ర ప్రాంతంగా మార్చెను.

దీనిని ప్రజలు పవిత్రంగా మార్చలేదు, అల్లాహ్ తఆలా పవిత్రంగా మార్చెను. ఇది ప్రళయ దినం వరకు పవిత్రంగా ఉంటుంది. కావున అల్లాహ్ తఆలాను, ప్రళయ దినాన్ని విశ్వసించే వ్యక్తి ఇందులో రక్తపాతానికి పాల్పడుట లేదా దీని చెట్టును నరుకుట ధర్మబద్ధం కాదు. ఇలా చేయడం నాకంటే ముందెవరికి ధర్మబద్ధం కాలేదు, నా తర్వాత కూడ ఎవ్వరికి ధర్మబద్ధం కాదు. నా కొరకు ఒక ఘడియ ధర్మబద్ధం అయ్యెను. అనంతరం దాని పవిత్రత నిన్నటి వలె తిరిగి వచ్చినది. మీలో హాజరైన వారు ఇక్కడ లేని వారికి ఈ విషయం తెలుపండి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇందులో యుద్ధం చేశారని మీకెవరైనా చెప్పినచో అతనికిట్లు తెలుపండి. అల్లాహ్ తఆలా తన ప్రవక్త కొరకు ధర్మబద్ధం చేసెను. కాని అతడు మీ కొరకు ధర్మబద్ధం చేయలేదు. ఓ ప్రజలారా! పవిత్ర ప్రాంతంలో యుద్ధం చేసిన వ్యక్తి లేదా తన హంతకుణ్ణి తప్ప మరొకనిని హత్య చేసిన వ్యక్తి లేదా మూర్ఖత్వ కాలం (ఇస్లాం కంటే పూర్వం) హత్యకు ప్రతీకారంగా హత్య చేసిన వ్యక్తి మీలో అల్లాహ్ తఆలా సమక్షంలో అందరి కంటే ఎక్కువ ధైర్యానికి (అవమానానినికి) ప్పాల్పడినవాడగును. ఓ బనూ ఖజాఅ తెగ ప్రజలారా! హత్యలకు పాల్పడకండి. మీరొక వ్యక్తిని హత్య చేశారు. నేను అతని ప్రాణ పరిహారం చెల్లిస్తాను. నేను జమానత్ (రక్షణ) కల్పించిన వ్యక్తిని ఎవరైనా హత్య చేసినచో అతనికి రెండు అధికారాలుండును. కోరినచో పరిహారం స్వీకరించవచ్చును లేదా హంతకున్ని హత్య చేయవచ్చును. అనంతరం బనూ ఖజాఅ హత్య చేసిన వ్యక్తి పరిహారంగా వారు సల్లల్లాహు అలైహి వసల్లం వంద ఒంటెలను చెల్లించారు. బనూ ఖజాఅ తెగ తరపున వారు సల్లల్లాహు అలైహి వసల్లం పరిహారం చెల్లించారు.

అదే రోజులలో వారి సల్లల్లాహు అలైహి వసల్లం హత్యకు కుట్ర పన్నిన ఫుజాల బిన్ ఉమైర్ విషయం కూడ వారి సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిసినది. ఇతడిట్లు తెలిపెను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఖానా కాబా ప్రదక్షిణ చేస్తున్నప్పుడు చురకత్తితో దాడి చేసి వారి సల్లల్లాహు అలైహి వసల్లంను నవూజుబిల్లాహ్ హత్య చేయాలనే ఉద్దేశంతో అదే సమూహంలో వారి సల్లల్లాహు అలైహి వసల్లం వెనుక వెనుక వెళ్లాను. అతడు వారి సల్లల్లాహు అలైహి వసల్లంనకు దగ్గరకు చేరుకోగానే వారు స.అ.స. అతణ్ణి చూసి ఇట్లడిగిరి. నువ్వు ఫుజాలవేనా? అవునని అతడు చెప్పెను. ఇట్లడిగిరి. మనసులో ఏమి ఆలోచిస్తున్నావు? అతడు అబద్ధమాడుతు నేను అల్లాహ్‌ను స్మరించుకుంటున్నానని బదులిచ్చెను. అప్పుడు వారు స.అ.స. చిరునవ్వు నవి, ఇట్లనిరి. అల్లాహ్‌తో క్షమాపణ యాచించుము. నవ్వు చెప్తున్నది చేయడం లేదు. వారు స.అ.స. ఇంకా దగ్గరకు వచ్చి అతని యదపై హస్తం పెట్టిరి. ఫుజాలా ఇట్లు తెలిపెను. దేవుని ప్రమాణంగా! వారు స.అ.స. యద మీది నుండి హస్తం తీయకముందే ప్రపంచంలో అందరి కంటే ఎక్కువ ప్రియమైన వ్యక్తి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనిపించ సాగిరి. అప్పుడతడు తమ కుటుంబ సభ్యుల వద్దకు తిరిగి వచ్చెను, అతని జీవితమే మారిపోయెను.

అదే రోజులలో హజ్రత్ అబూబక్ర్ (రజి) తండ్రి ఇస్లాం స్వీకరించిన సంఘటన కూడ లభిస్తుంది.

హజ్రత్ ఉమ్మె హానీ రజియల్లాహు అన్‌హా గృహంలో వారు స.అ.స. భోజనం చేసిన సంఘటన కూడ లభిస్తుంది. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. వారు స.అ.స. మక్కా విజయం రోజున హజ్రత్ ఉమ్మె హానీ (రజి)తో ఇట్లడిగిరి. మేము భుజించుటకు నీ వద్ద భోజనం ఉందా? ఎండిన రొట్టెల ముక్కలు తప్ప మరేమి లేదు. వాటిని మీకు అందించాలంటే నాకు సిగ్గు వేస్తుందని

ఆమె బదులిచ్చెను.. వారు స.అ.స. ఇట్లనిరి. వాటినే తీసుకొని రా! వారు స.అ.స. వాటిని నీళ్లలో తడిపిరి. ఆమె ఉప్పు కూడ తీసుకొచ్చిరి. వారు స.అ.స. ఇట్లడిగిరి. ఏదైనా కూర రసం ఉందా? ఆమె ఇట్లనిరి. ఓ దైవ ప్రవక్త స.అ.స! సిర్క రసం తప్ప నా వద్ద మరేమి లేదు. వారు స.అ.స. ఇట్లనిరి. అదే సిర్క రసం తీసుకొని రా! వారు స.అ.స. దానిని రొట్టెలపై పోసుకొని భుజించి అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపుకొనిరి. అనంతరం ఇట్లనిరి. ఇదెంతో మంచి కూర. ఓ ఉమ్మె హానీ! ఎవరి ఇంట్లో సిర్క రసం ఉందో అతడు బీదవాడు కాదు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇది అత్యద్భుత కృతజ్ఞత భావం. ఉమ్మె హానీ (రజి)ను కూడ ప్రోత్సహించిరి. మక్కా విజయుని స్థితి ఇట్లుండెను. ప్రతి ఇంటి నుండి అన్ని తెప్పించుకునే అవకాశముండెను. కాని వారు స.అ.స. ఈ ఎండిన కొద్ది రొట్టెలతోనే పూట గడిపిరి.

వారు సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా చేరుకున్న తర్వాత అక్కడి ప్రతి వస్తువును ప్రత్యేకంగా ఖానా కాబాను ప్రేమతో చూస్తున్నందున అన్సార్ హృదయంలో వారు స.అ.స. ఇక్కడే వుండిపోతారేమో ననే సందేహం కలిగింది. హజ్రత్ అబూహురైరహ్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. అన్సార్ పరిస్థితి ఇట్లు మారినప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై సువార్తవాణి అవతరించినది. సువార్తవాణి ముగిసిన తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఓ అన్సార్ ప్రజలారా! ఈ వ్యక్తిని మాతృదేశ ప్రేమ జయించినదని మీరు భావిస్తున్నారా! అవును, పరిస్థితి ఇలాగే ఉన్నదని వారనిరి. వారు స.అ.స. ఇట్లనిరి. అలా జరిగినచో నా పేరేముంటుంది? నేను ముహమ్మద్‌ను, అల్లాహ్ దాసున్ని, అతని ప్రవక్తను. నేను అల్లాహ్ కొరకు మీ వద్దకు వలస వచ్చాను. ఇక నా జీవితం, మరణం మీతోటే సాగుతుంది. అప్పుడు వారు రోధిస్తు వారి స.అ.స. వద్దకు వస్తు ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణంగా! మేము ఏదైనా అన్నామంటే అది అల్లాహ్, అతని ప్రవక్త స.అ.స. అభిమానంలోనే, వారు స.అ.స. వీడి పోతారనే భయంతోనే అన్నాము. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నిశ్చయంగా! అల్లాహ్, అతని ప్రవక్త మీ ఈ మాటను దృవీకరిస్తున్నారు, మీ సాకును ఆమోదిస్తున్నారు.

జుహ్ర్ నమాజ్ సమయం కాగానే వారు స.అ.స. బిలాల్ (రజి)ను ఆదేశించగా వారు (రజి) ఖానా కాబా పై కప్పు ఎక్కి అజాన్ ఇచ్చిరి. కథనం ప్రకారం ఆ రోజు వారు స.అ.స. నమాజులన్నిటిని ఒకే వుజూతో సలిపినారు. హజ్రత్ ఉమర్ (రజి) ఇట్లు వేడుకొనిరి. సాధారణంగా మీరు చేయని పని నేడు చేశారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఉమర్! ఉద్దేశపూర్వకంగానే నేనలా చేశాను. అసవరమొచ్చినప్పుడు ఇలా చేయవచ్చుననే సౌకర్యం కల్పించుటకు వారు స.అ.స. అలా చేసి ఉదాహరణ స్థాపించారని ముస్లిం విద్యావంతులు వివరించారు.

అదే సమయంలో వారు సల్లల్లాహు అలైహి వసల్లం బహిరంగ బైఅత్ కూడ తీసుకున్నారు. అల్లాహ్‌ను విశ్వసించుట గురించి, అల్లాహ్ తఆలా తప్ప మరో ఆరాధ్య దైవం లేదని, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని దాసుడు, ప్రవక్త అని బైఅత్ తీసుకున్నారు. పురుషుల బైఅత్ ముగించు కున్న తర్వాత వారు స.అ.స. స్త్రీలతో బైఅత్ తీసుకున్నారు. ఆయా స్త్రీలలో అబూసుఫ్యాన్ భార్య హింద కూడ ఉండెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మరణ శిక్ష పడిన నేరస్తుల గురించి ఇట్లు వ్రాసి ఉంది. వివరాలను ఇప్పుడు ప్రస్తావింతును. దీని గురించి ప్రజలకు కొన్ని ప్రత్యేక భావాలున్నాయి, సంఘటనలు కూడ ఇదే

విషయాన్ని తెలుపుతున్నాయి. ఎందుకనగా ఏ కారణాల వలన మరణ శిక్ష ఆదేశించబడెనని ప్రస్తావన గలదో అది మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆచరణ, స్వభావానికి విరుద్ధమని స్పష్టంగా తెలుస్తుంది. దీని గురించి హ॥జ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) వ్రాసిన తమ అభిప్రాయం ఏమనగా కేవలం పదకొండు పురుషులు, స్త్రీల గురించే తీవ్ర హత్యలు, అశాంతి రుజువయ్యెను. వారు యుద్ధ నేరస్తులైనందున వారి గురించి మరణ శిక్ష ఆదేశాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జారీ చేసిరి. వారు కేవలం అవిశ్వాసం, వివాదానికి గురైన నేరస్తులు కాక యుద్ధ నేరస్తులుగా ఉండిరి. కాని వారిలోని అధికులను ముస్లింల సిఫారసుతో వారు స.అ.స. క్షమించిరి.

ఈ విషయం గురించి వివరాలు, వాటి ఖండనను ప్రస్తావించిన తర్వాత హుజూరె అన్వర్ ఇట్లనిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆగమన వార్త విని కొందరు ఖురైష్ నాయకులు, మొదటి వరుసలో ఉన్న వ్యతిరేకులు మక్కా నుండి పారిపోయిన విషయంలో సందేహం లేదు. తమ హత్య గురించి ఆదేశించబడి నందున వారు పారిపోయారని ఇబ్నె ఇస్‌హాక్ మాత్రమే వ్రాశారు. సారాంశం ఏమనగా మక్కా విజయం సందర్భంన కొందరు వ్యక్తుల గురించి మాత్రమే మరణ శిక్ష తీర్పు వెలువడెను. ఈ కాలపు న్యాయమూర్తి, అధికారి అయిన హ॥జ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. శిక్షించుటకు ఏకేశ్వరుడైన అల్లాహ్ తఆలా తరపున గట్టి నిర్ణయం అందిన కొద్ది మంది మాత్రమే శిక్షించబడిరి. ఆయా శాశ్వత శాపగ్రహీతలు తప్ప ప్రతి ఒక్క శత్రువు పాపం క్షమించబడెను. దాని వాస్తవం ఇది. ఇంత మంది హత్యకు గురైనారని, అవమానించబడ్డారని, ప్రవక్తుత్వాన్ని అవమానించారనే మాటలన్ని తప్పే. మిగతా వివరాలు తర్వాత ప్రస్తావించబడును. ఇన్‌షాఅల్లాహ్.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ప్రపంచ పరిస్థితులు మీకు మంచిగానే తెలుసు. ఈ విషయాల గురించి అనేక సార్లు చెప్పాను, చెప్తుంటాను. స్థోమత కలిగిన ప్రజలు ఆందోళనకర పరిస్థితుల దృష్ట్యా కొన్ని నెలల రాషన్ సరుకులు ఇండ్లలో పెట్టుకోవలెను. మూడు నెలల రాషన్ సరుకులు పెట్టుకోవాలని ఇప్పుడు కొన్ని ప్రభుత్వాలు కూడ తమ పౌరులను సూచించాయి. మొత్తమ్మీద అల్లాహ్ తఆలా ప్రపంచాన్ని కరుణించుగాక! యుద్ధ ప్రమాదకర, భయంకర పరిస్థితుల నుండి రక్షించుగాక!

ఖుత్బా జుమా ముగింపులో హుజూరె అన్వర్ హ॥జ్రత్ మిర్జా షరీఫ్ అహ్మద్ రజియల్లాహు అన్‌హు గారి మనుమరాలు (పోతి), హ॥జ్రత్ నవాబ్ అమతుల్ హఫీజ్ బేగం రజియల్లాహు అన్‌హా గారి మనుమరాలు (నవాసీ), కర్నల్ మిర్జా దాఊద్ అహ్మద్ గారి కుమార్తె, రాజా అబ్దుల్ మాలిక్ గారి భార్య అయిన అమతున్నసీర్ నిగ్‌హత్ గారు (2) గౌ॥ అల్‌హాజ్ యాకూబ్ అహ్మద్ బిన్ అబూబక్‌ర్ గారు మాజీ హెడ్‌మాస్టర్ సీనియర్ స్కూల్, జాతీయ ప్రచార కార్యదర్శి ఘానా గారల మరణ వార్త తెలిపి, వారి సద్గుణాలను ప్రస్తావించి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించిరి.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ـ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ـ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ـ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ـ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ـ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ـ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ـ